సాక్షి
అనంతపురం
ఆదివారం। 16। మార్చి। 2025




చీనీ టన్ను రూ.25,200

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25,200 పలికాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

త్వరలో హెచ్చెల్సీలో అత్యవసర పనులు



కాలువను పరిశీలిస్తున్న ఎస్‌ఈ రాజశేఖర్

బొమ్మనహాళ్: తుంగభద్ర ఎగువ కాలవ (హెచ్చెల్సీ)లో త్వరలోనే అత్యవసరం కింద పనులు ప్రారంభిస్తున్నట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలో కాలువను పరిశీలించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించాలని స్థానిక అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విలేకరులతో ఎస్‌ఈ మాట్లాడుతూ హెచ్చెల్సీలో 165వ కిలోమీటర్ నుంచి 189 కిలోమీటర్ వరకు రూ.34.95 కోట్లతో పనులు జరుగుతాయని తెలిపారు. బొమ్మనహాళ్ మండలంలో రూ.16 కోట్లతో వంతెన, లైనింగ్ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జేఈఈ అల్తాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటి అప్పు చేసి ఉడాయింపు



బ్రహ్మనాయుడు

రాప్తాడురూరల్: అనంతపురం నగర శివారులోని హార్మోని సిటీలో గోల్డెన్ గ్లోబ్ సంస్థ ఉద్యోగి గుడిపాటి బ్రహ్మనాయుడు రూ. కోటి అప్పు చేసి ఉడాయించాడు. ఇటీవల బాధితులు నేరుగా ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు, గోల్డెన్ గ్లోబ్ ఎండీ ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల మేరకు...హైదరాబాద్‌కు చెందిన గుడిపాటి బ్రహ్మనాయుడు 2021 నుంచి ఇక్కడ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. నమ్మకంగా ఉంటూ కంపెనీ ఉద్యోగులను, కాంట్రాక్టర్లను బురిడీ కొట్టించాడు. భూములు కొనుగోలు చేయిస్తానని డబ్బులు తీసుకున్నాడు. అలాగే తన కూతురి చదువుకు డొనేషన్ చెల్లించాలంటూ అప్పులు చేశాడు. కొందరితో నగదు, మరికొందరితో చెక్కుల రూపంలో రూ. కోటి వరకు తీసుకుని ఎవరికీ చెప్పాపెట్టకుండా ఇటీవల ఉడాయించాడు. కంపెనీ ప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఫోన్లు చేసినా స్పందించలేదు. అందరి నంబర్లు బ్లాక్ చేశాడు. ఇతర రాష్ట్రానికి పారిపోయినట్లు బాధితులు వాపోతున్నారు. 15 రోజుల క్రితం గోల్డెన్ గ్లోబ్ ఎండీ ఎస్.రవికుమార్ ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో రూరల్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి బ్రహ్మనాయుడి కోసం గాలిస్తున్నారు.

తాకట్టులో ఉన్న భూమిని విక్రయించి..

రాప్తాడు మండలంలో శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి నుంచి 54 సెంట్ల స్థలాన్ని బ్రహ్మనాయుడు కొనుగోలు చేశాడు. వాస్తవానికి ఈ భూమి మీద శ్రీరామ్ ఫైనాన్స్‌లో శ్రీనివాసరెడ్డి రుణం పొందాడు. కొనుగోలు సమయంలో ఈ రుణం తానే చెల్లిస్తానని చెప్పి తక్కిన సొమ్ము శ్రీనివాసరెడ్డికి ఇచ్చాడు. ఈ విషయాన్ని దాచిపెట్టిన బ్రహ్మనాయుడు ఈ స్థలాన్ని సెంటు రూ. 2.65 లక్షల ప్రకారం ఓ మహిళకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించాడు. అసలు విషయం ఆలస్యంగా తెలుసుకున్న సదరు మహిళ లబోదిబోమంటోంది.

జేఎన్‌టీయూ(ఏ) స్నాతకోత్సవానికి నోటిఫికేషన్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం 14వ స్నాతకోత్సవ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు తెలిపారు. ఏప్రిల్, మే నెలలో నిర్వహించే స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో బీటెక్, ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 15 లోపు తుది గడువుగా నిర్దేశించారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు. పూర్తి వివరాలకు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో చూడాలి.

కూల్చివేతలు.. కన్నీళ్లు

- అనంతపురం రూరల్ విద్యారణ్యనగర్‌లో 68 సెంట్లలో ఇళ్ల నిర్మాణాల కూల్చివేత
- ఏళ్ల క్రితం కట్టుకున్న నిర్మాణాలు కూల్చడంతో బాధితుల కన్నీరుమున్నీరు
- అడ్డుకునే ప్రయత్నం చేసిన రిటైర్డ్ జడ్జి కిష్టప్పపై పోలీసుల జులుం
- ఘటనాస్థలిలో టీడీపీ నాయకుల హల్‌చల్.. సర్వత్రా చర్చనీయాంశం



జేసీబీలతో నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్ ఇంటిని కూల్చుతున్న దృశ్యం

రాప్తాడురూరల్: ఉద్రిక్తత నడుమ అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌లోని 106–1 సర్వే నంబరులోని 68 సెంట్లలో ఉన్న నిర్మాణాల కూల్చివేతను శనివారం అధికారులు ప్రారంభించారు. సుదీర్ఘ కాలం కోర్టు వివాదంలో ఉన్న ఈ స్థలంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు. దశాబ్దాల క్రితం కట్టుకున్న నిర్మాణాలను కూల్చివేయడంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాలు.. కళ్యాణదుర్గం రోడ్డు విద్యారణ్యనగర్‌లో ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న 68 సెంట్ల స్థల వివాదంపై 1990 లోనే జిల్లా సివిల్ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకున్న వారందరూ ఆక్రమణదారులని తేల్చింది. దీనిపై ఇరువర్గాల వారు హైకోర్టు, అక్కడి నుంచి సుప్రీం కోర్టుకు వెళ్లగా.. కింది కోర్టు ఉత్తర్వులను సమర్థించాయి. ఈ క్రమంలో నిర్మాణాలను తొలగించి శోత్రియందారు శ్రావణ్‌కుమార్‌కు స్వాధీనం చేయాలంటూ 2024 డిసెంబరులో హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై తర్వాత ఎలాంటి ఉత్తర్వులందలేదు. కలెక్టర్‌పై శోత్రియం యజమాని కంటెమ్ట్(కోర్టు ఉల్లంఘన) కేసు వేశారు. ఈ క్రమంలో అక్కడ నివాసాలుంటున్న వారికి నోటీసులు జారీ చేసి నిర్మాణాల తొలగింపునకు చర్యలు తీసుకున్నట్లు ఆర్డీఓ కేశవ నాయుడు తెలిపారు. నోటీసుల సమయంలోనే ఖాళీ చేయాలని చెప్పామని, పట్టించుకోని కారణంగానే బలవంతంగా తొలగిస్తున్నామన్నారు.



విద్యారణ్యనగర్‌లో గుమిగూడిన ప్రజలు



బందోబస్తులో ఉన్న పోలీసులకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న టీడీపీ నాయకులు

తీవ్ర ఉత్కంఠ...

ఉదయాన్నే జేసీబీలు, పోలీసులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో విద్యారణ్యనగర్‌లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. స్థానికులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆయా ఇళ్లవారు అధికారులను ఎంత ప్రాధేయపడినా పట్టించుకోలేదు. తామేమీ చేయలేమని, హైకోర్ట్ తీర్పు మేరకు ఖాళీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఇళ్లల్లో సామాన్లు తీసుకోకపోవడంతో బలవంతంగా తీసుకొచ్చి పక్కన పడేశారు. ముందుగా నాట్యాచార్యుడు పట్నం శివ ప్రసాద్ ఇంటిని కూలదోశారు. ఈ సమయంలో ఇంటి మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు.

టీడీపీ నాయకుల హల్‌చల్..

భవన కూల్చివేతల సమయంలో టీడీపీ నాయకులు హల్‌చల్ చేయడం కనిపించింది. పైగా బందోబస్తులో ఉన్న పోలీసులకు టీలు, మజ్జిగ ప్యాకెట్లు పంచడం తీవ్ర చర్చనీయాంశమైంది.



ఆవేదన వ్యక్తం చేస్తున్న నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్, కుటుంబసభ్యులు

రిటైర్డ్ జడ్జి కిష్టప్పపై జులుం

నిర్మాణాల కూల్చివేతను రిటైర్డ్ జడ్జి కిష్టప్ప, సీపీఎం నాయకులు రామిరెడ్డి, ముత్తూజ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే రిటైర్డ్ జడ్జి కిష్టప్ప పట్ల పోలీసులు జులుం ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా తొలగిస్తున్నారంటూ అనంతపురం రూరల్ తహసీల్దార్ మోహన్‌కుమార్‌తో కిష్టప్ప మాట్లాడుతుండగా... రూరల్ డీఎస్పీ వెంకటేశులు వచ్చి అక్కడి నుంచి ఆయనను తోసేశారు. తాను రిటైర్డ్ జడ్జి అని చెబుతున్నా వినకుండా అమానుషంగా ప్రవర్తించారని కిష్టప్ప వాపోయారు. మొబైల్‌లో వీడియో తీస్తున్న లా విద్యార్థి హేమంత్‌పైనా పోలీసులు దాడి చేశారన్నారు.



రిటైర్డ్ జడ్జి కిష్టప్పను బలవంతంగా తీసుకెళ్తున్న పోలీసులు

కోర్టులో కేసు పెండింగ్ ఉన్నా తొలగిస్తారా?

ఎనిమిది మంది బాధితులకు సంబంధించి సివిల్ కోర్టులో కేసు పెండింగ్ ఉందని, అయినా వారి ఇళ్లను ఎలా తొలగిస్తారో అర్థం కావడం లేదని రిటైర్డ్ జడ్జి కిష్టప్ప అన్నారు. ల్యాండ్ గ్రాబింగ్‌పై కోర్ట్ ఇచ్చిన తీర్పుపై వ్యతిరేకత ఉంటే సివిల్ కోర్టులో కేసు వేసుకోవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఉందని, ఆ ప్రకారమే 8 మంది బాధితులు సివిల్ కోర్టులో కేసు వేశారన్నారు. అవన్నీ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. గతంలో కలెక్టర్‌గా గౌతమి ఉన్న సమయంలోనూ ఇదే కేసులో కంటెమ్ట్ వేశారన్నారు. రెవెన్యూ అధికారులు అందుకు సంబంధించిన రికార్డులన్నీ కోర్టుకు సమర్పించారన్నారు. పిటిషనర్ శ్రావణ్‌కుమార్ వారసుడా కాదా తెలీదని, పైగా తహసీల్దార్ నుంచి తీసుకొచ్చిన లీగల్ హైర్ సర్టిఫికెట్ చెల్లదని కౌంటర్‌లో పేర్కొన్నారన్నారు. వారి పూర్వీకులే ఎవిక్షన్ (తొలగింపు) పిటీషన్ వేసుకున్నారని, అప్పట్లోనే వారికి స్వాధీనం చేసినట్లు తమ వద్ద రికార్డులు కూడా ఉన్నాయంటూ అప్పటి కలెక్టర్ పక్కా రికార్డులను కోర్టుకు సమర్పించడంతో హైకోర్టు తర్వాత చర్యలకు వెళ్లలేదన్నారు. అయితే శ్రావణ్‌కుమార్ ఇటీవల హైకోర్టు నుంచి ఒక ఉత్తర్వు తెచ్చుకున్నాడని, అందుకు కౌంటర్ దాఖలు చేయాల్సిన అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడడం అన్యాయమన్నారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో అర్థం కావడం లేదన్నారు.

సర్వే చేయకుండా తొలగిస్తారా?

ఈ కేసులో చట్టపరంగా వ్యవహరించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. సర్వే చేసి తొలగించాలనే నిబంధనను పాటించలేదన్నారు. ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా.. ఏ ఒక్కరికీ ఇవ్వకుండా ఈ రకమైన చర్యలకు ఎలా పాల్పడతారని ప్రశ్నించారు. ఏకపక్షంగా బాధితుల ఆస్తులను ఎలా ధ్వంసం చేస్తారన్నారు. చరిత్రలో ఎప్పుడూ ఇలా జరిగి ఉండదన్నారు. బాధితుల పక్షాన నిలబడతామని, చట్టబద్ధంగా ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనలో రెవెన్యూ అధికారులు వ్యవహరించిన తీరుపై ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి అన్ని వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

పదింతల నిర్లక్ష్యం



ఈయన పేరు జి.ఆంజనేయ ప్రసాద్. అనంతపురం నగరంలోని రామకృష్ణకాలనీ పాఠశాలలో పని చేస్తున్నాడు. పక్షవాతం కారణంగా కుడికాలు, కుడి చేయి పని చేయడం లేదు. నోటి నుంచి మాటలు కూడా స్పష్టంగా రావు. ఇలాంటి టీచరును పదో తరగతి వార్షిక పరీక్షల ఇన్విజిలేషన్ విధులకు వేశారు. డ్యూటీ రద్దు చేయించుకునేందుకు తన కుమారుడి సాయంతో శనివారం ఉదయాన్నే డీఈఓ కార్యాలయానికి ఆంజనేయప్రసాద్ వచ్చారు.



ఈయన పేరు కల్లూరు విజయభాస్కర్. కళ్లు కనపడవు. అనంతపురం రూరల్ మండలం ఎస్‌ఆర్‌కాలనీ పాఠశాలలో పని చేస్తున్నారు. ఈయన ఇంటి నుంచి బయటకు రావాలంటే మరొకరు తోడు తప్పనిసరిగా ఉండాలి. అలాంటి టీచరును 'పది' ఇన్విజిలేషన్ విధులకు నియమించారు.



ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు పి.రమేష్‌బాబు. అనంతపురంలోని శ్రీ పొట్టిశ్రీరాములు నగర పాలక ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచరుగా పని చేస్తూ 2024 అక్టోబరు 31న రిటైర్డ్ అయ్యారు. ఈయనను కూడా 'పది' పరీక్షల విధులకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. వీరే కాదు.. ఇలా చాలా మందిని ఇష్టారాజ్యంగా పరీక్ష విధులకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు ఘనత వహించిన విద్యాశాఖ అధికారులు.



డ్యూటీ రద్దు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న డీఈఓ కార్యాలయ సిబ్బంది

- ఇష్టారాజ్యంగా పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్ విధులు
- అంధులు, పక్షవాత బాధితులు, దివ్యాంగ టీచర్లకూ బాధ్యతలు
- రిటైర్డ్ అయిన టీచర్లూ జాబితాలో..
- ప్రక్రియపై సర్వత్రా విమర్శలు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా రేపటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్విజిలేటర్ల నియామకాలను ఇష్టారాజ్యంగా చేపట్టడం సర్వత్రా విమర్శలకు దారితీసింది. సంబంధిత ఎంఈఓలు, హెచ్‌ఎంల నుంచి టీచర్ల జాబితాలు తెప్పించుకుని డ్యూటీలకు వేసి ఉంటే గందరగోళం ఉండేదికాదు. అలా కాకుండా తమవద్ద ఉన్న జాబితాల ఆధారంగా డ్యూటీలు వేయడం గమనార్హం. చాలామంది దీర్ఘకాలిక వ్యాధులు, దివ్యాంగులు, అంధులు, సెలవుల్లో ఉన్న వారు, చివరకు రిటైర్డ్ అయిన వారినీ వదలకుండా డ్యూటీలకు వేశారంటే పరీక్షల నిర్వహణ అధికారుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది. ఇలాంటి వారందరూ తమ డ్యూటీలను రద్దు చేయించుకునేందుకు శనివారం డీఈఓ కార్యాలయానికి క్యూ కట్టారు.

'సాక్షి' కథనంపై అంతటా చర్చ..

విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాదాపు 40 శాతం మందికిపైగా ఇన్విజిలేటర్లకు శుక్రవారం రాత్రి వరకు సమాచారం చేరలేదు. ఈ క్రమంలో శనివారం ఉదయాన్నే బడికి పోవాలా? పరీక్ష కేంద్రంలో రిపోర్ట్ చేసుకోవాలా? అనే సందిగ్ధంలో ఉన్న టీచర్ల దుస్థితిపై 'పది పరీక్షల నిర్వహణలో గందరగోళం' శీర్షికతో 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ వినోద్‌కుమార్ తీవ్రంగా పరిగణించి విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలంటూ డీఆర్‌ఓ మలోలను ఆదేశించారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి ఆర్జేడీ శామ్యూల్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆగమేఘాలపై విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, సీఎస్, డీఓలతో టెలీ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి డీఆర్‌ఓ, ఆర్జేడీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మరికొందరు బాధితులు ఇలా..

అనంతపురం రూరల్ ఎంఈఓ కార్యాలయం పక్కనే ఉన్న రూరల్ పాఠశాలలో పని చేస్తున్న నాగేంద్ర దివ్యాంగుడు. మూడు చక్రాల వాహనంలో బడికి వెళ్తాడు. ఇలాంటి వ్యక్తినీ వదలకుండా డ్యూటీకి వేశారు. అలాగే ఆకుతోటపల్లి పాఠశాలలో పని చేస్తున్న నారాయణరెడ్డికి ఒక చేయి పూర్తిగా లేదు. సుబ్బరాయుడు అనే టీచరు కేన్సర్ బాధితుడు. వై.చిక్కిరప్ప నగరంలోని ఎస్కేడీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచరుగా పని చేస్తున్నాడు. ఈయన ఈనెల 1 నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఈయనను పరీక్ష విధులకు నియమించారు. అలాగే బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి పరీక్ష కేంద్రానికి మెడికల్ లీవ్‌లో ఉన్న ఇద్దరు టీచర్లను డ్యూటీలకు వేయడం గమనార్హం

సీఎస్‌లకు జాబితాలు ఇవ్వడంతోనే..

ఇన్విజిలేటర్ల నియామక ఉత్తర్వులను ఎంఈఓలు, హెచ్‌ఎంలకు పంపితే వారు స్కూళ్ల నుంచి రిలీవ్ చేస్తారు. వారిని సీఎస్, డీఓలు సెంటర్లలో వినియోగించుకుంటారు. సీఎస్‌లకు జాబితాలు పంపి ఇన్విజిలేటర్లకు సమాచారం చేరవేయాలని ఆదేశాలు జారీ చేసినా వారు పెద్దగా పట్టించుకోలేదు. నగరంలోని జీసస్‌నగర్‌లోని నారాయణ స్కూల్ సీఎస్‌కు శనివారం ఉదయం 9 గంటలకు ఫోన్ చేసి బాలసుబ్రమణ్యం అనే టీచరు ఇన్విజిలేషన్ విధుల్లో ఉన్నారా? అని అడిగితే ఆ పేరు గల వ్యక్తి తమ కేంద్రంలో లేరని చెప్పారు. వాస్తవానికి ఈ సెంటర్‌కు 17 మంది టీచర్లను నియమిస్తే అందులో బాల సుబ్రమణ్యం పేరు 4వ స్థానంలోనే ఉంది. అయినా, ఆ టీచరు పేరు లేదని చెప్పడం చూస్తుంటే ఇన్విజిలేటర్ల జాబితాలను సీఎస్‌లు ఏ విధంగా పరిశీలించారో అర్థం చేసుకోవచ్చు.

విద్యార్థులకు 'సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్స్'

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 6–9 తరగతుల విద్యార్థులకు విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 'సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్స్ (ఎక్స్‌కర్షన్)' నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 8,9 తరగతుల పిల్లలు బెంగళూరులోని విశ్వేశ్వరయ్య మ్యూజియం, కుప్పం అగస్త్య ఫౌండేషన్ సందర్శించేలా, 6,7,8 తరగతుల పిల్లలు బెంగళూరులోని విశ్వేశ్వరయ్య మ్యూజియం, జిల్లా సైన్స్ సెంటర్ – మ్యూజియంను సందర్శించేలా ఏర్పాటు చేశామన్నారు. సెకండరీ స్థాయికి సంబంధించి జిల్లా సైన్స్ ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన విద్యార్థులందరినీ ఎంపిక చేశామన్నారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బస్సులు ఏర్పాటు చేస్తామని, పిల్లల వివరాలు అందగానే తేదీలను ప్రకటిస్తామన్నారు.



శేష వాహనంపై శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవారు



పోటెత్తిన భక్త జనం

వైభవంగా ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోతోంది. భక్తుల గోవింద నామస్మరణతో ఖాద్రీ క్షేత్రం మార్మోగిపోతోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా శేష వాహనంపై తిరువీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. స్వామివారి దివ్య మంగళరూపాన్ని భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు. వైకుంఠంలో స్వామి నిత్యం పవళించి ఉండే శేష తల్పం ఆ స్వామితో పాటే భువికి దిగి వచ్చిందని భక్తుల విశ్వాసం. అందుకే స్వామివారు బ్రహ్మోత్సవాల్లో శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిస్తున్నారని వారి నమ్మకం. 'శేషవాహనం ముఖ్యంగా దాస్యభక్తికి నిదర్శనం. ఆ భక్తితో పశుత్వం తొలగి మానవత్వం, దాని నుంచి దైవత్వం, ఆపై పరమపదం సిద్ధిస్తాయి' అని అర్చక పండితులు పేర్కొన్నారు. శేష వాహనంపై ఉన్న స్వామి వారిని దర్శించుకుంటే సర్పదోషం పోతుందని భక్తుల నమ్మకం.

క్లుప్తంగా

బీటెక్ విద్యార్థి అదృశ్యం


లక్ష్మీకాంత్‌రెడ్డి

నల్లమాడ: ఎద్దులవాండ్లపల్లికి చెందిన లక్ష్మీకాంత్ రెడ్డి అనే బీటెక్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రామ్మోహన్‌రెడ్డికి ఇద్దరు సంతానం. వీరు కొన్నేళ్ల క్రితం బెంగళూరుకు వలస వెళ్లి స్థిరపడ్డారు. పెద్ద కుమారుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అనంతపురంలోని ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల ఏడో తేదీన లక్ష్మీకాంత్‌రెడ్డి బెంగళూరుకు వస్తున్నానని తండ్రికి ఫోన్‌లో చెప్పి స్వగ్రామం ఎద్దులవాండ్లపల్లి నుంచి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. కొంతసేపటి తర్వాత తండ్రి ఫోన్ చేయగా స్విచాఫ్ అని వచ్చింది. అనుమానం వచ్చి అనంతపురం, బెంగళూరు ప్రాంతాల్లో గాలించినా కుమారుడి ఆచూకీ కన్పించలేదు. దీంతో రామ్మోహన్‌రెడ్డి శనివారం నల్లమాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మునిరెడ్డి (ఫైల్)

పుట్లూరు: నాయకునిపల్లి సమీపంలో శనివారం ఉదయం విద్యుదాఘాతంతో రామమునిరెడ్డి (40) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. విద్యుత్‌శాఖలో సిబ్బంది కొరత కారణంగా కొన్నేళ్లుగా రామమునిరెడ్డి ఆ శాఖ అధికారులకు, సిబ్బందికి సహాయకుడిగా పనిచేసేవాడు. ఈ క్రమంలో పుట్లూరుకు చెందిన ఓబులేసు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు సరిచేస్తున్న సమయంలో షాక్‌కు గురై చనిపోయాడు. ఎస్‌ఐ వెంకటనరసింహ సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రామమునిరెడ్డి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


బస్సు కోసం ఎదురుచూపు


అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థుల హడావుడి


అరె.. సీట్ పట్టుకోరా..!


అదిగో మన బస్సు.. త్వరగా పద

మళ్లీ కలుద్దాం!



ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు శనివారం ముగిశాయి. అనంతపురంలో ఉండి చదువుకుంటున్న వివిధ ప్రాంతాల విద్యార్థులు హాస్టళ్లు, రూమ్‌లలోని లగేజీ సర్దుకుని ఇంటిబాట పట్టారు. స్నేహితులకు ఆత్మీయంగా వీడ్కోలు చెబుతూ బస్సులు, ఆటోల ద్వారా స్వస్థలాలకు బయల్దేరారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం విద్యార్థులతో కిటకిటలాడింది. బస్సుల్లో సీట్ల కోసం పోటీపడ్డారు. ఇన్నాళ్లూ కలసిమెలసి చదువుకున్న స్నేహితులకు బాయ్ చెప్పి.. మళ్లీ కలుద్దాం అంటూ ముందుకు కదిలారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


లగేజీ మోసుకొస్తున్న విద్యార్థులు


ఆటోలో ఇళ్లకు పయనమైన విద్యార్థులు

ఎకాలజీ సెంటర్‌లో రేపు ఉద్యోగమేళా

అనంతపురం అగ్రికల్చర్: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్‌రాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, టాటా స్ట్రయివ్, ఎంఎస్‌ఎన్ ఫార్మా సంస్థల్లో పోస్టుల భర్తీకి ఉద్యోగ మేళా ఉంటుందన్నారు. 10, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన 17 నుంచి 30 సంవత్సరాల యువతీ యువకులు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆయా సంస్థలలో స్టైఫండ్‌తో కూడిన శిక్షణ కల్పించి తర్వాత ఉపాధి కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు బయోడేటాతో సోమవారం హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 83283 68554, 90000 24919 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పాలనలో పారదర్శకత పాటించాలి


సమావేశం నిర్వహిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ అధికారి విజయరామరాజు, కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పాలనలో పారదర్శకత పాటించినప్పుడే విమర్శలకు, ఆరోపణలకు అవకాశం ఉండదని జిల్లా ఇన్‌చార్జ్ అధికారి, రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు పేర్కొన్నారు. జిల్లాకు విచ్చేసిన ఆయన శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి వివిధ అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మండలస్థాయిలో అధికారుల బృందాలను మరింత బలోపేతం చేయాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింతగా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారాన్ని పారిశ్రామికవేత్తలకు అందించాలని చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలన్నారు. ఏపీఐఐసీ కింద పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలని ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను అన్ని పంచాయతీల్లో పూర్తి చేయాలన్నారు. డ్వామా కింద కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. నియోజకవర్గానికి ఒక స్కిల్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్‌డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, మల్లికార్జున, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్
అనంతపురము రీజనల్ ఆఫీసు

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయడం ఏమనగా క్రింద కనబరచిన వ్యక్తులు "ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు" శాఖలలో "బంగారు నగలు" తాకట్టుపెట్టి ఋణం పొంది గడువు మీరినను, మొండి బకాయి అయినను మరియు మీరు పొందిన ఇతర ఋణములు మొండి బకాయి అయినను పలుమార్లు నోటీసులు పంపినను తిరిగి చెల్లించనందున సదరు బంగారు నగలను "28-03-2025" తేది శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం వేయబడును. ఆయా శాఖలకు సంబంధించిన ఆభరణముల వేలము ఆయా శాఖలలో నిర్వహించబడును.

క్ర. సం.	అప్పుదారుని పేరు, తండ్రి / భర్త పేరు, గ్రామము	బ్రాంచ్ పేరు	అప్పు ఖాతా సంఖ్య	స్థూల బరువు గ్రాములలో
1	జయంతి కృష్ణ కిషోర్ S/o వెంకట రత్నం, 4-61, మెయిన్ బజార్, నార్పల గ్రామం, అనంతపురం జిల్లా.	నార్పల	91190267435	50
2	శ్రీమతి పల్లెం గాయత్రి 8-149, ఎ. నారాయణపురం, స్టాలిన్ నగర్, అనంతపురం	తపోవనం	91178159233	20
3	మంగలి నాగరాజు తండ్రి మంగలి రామాంజనేయులు, డి.నం: 6-93, ఉద్దేహాల్ (గ్రా), బొమ్మనహాల్ (మం), అనంతపురం (జిల్లా)-515871	ఉద్దేహాల్	91187245951	13.5
4	వై. కృష్ణవేణి భర్త వై. వెంకట రమణ, డి.నెం.6-3-893 సంఘమిత్ర నగర్, అనంతపురం	అనంతపురం మారుతీనగర్	91180058933	7.8

వేలం షరతులు : 1) ఈ ఖాతాదారులలో ఎవరైనా బ్యాంకు వారు పంపిన నోటీసులు ఏ కారణం చేతైనా అందని ఎడల నోటీసులు తిరిగి వచ్చిన ఎడల వారికి కూడా ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. 2) ఖాతాదారుల్లో ఎవరైనా మరణించియుండిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. 3) ఏ విధమైన కారణము చూపకనే వేలం షరతులు మార్చుటకు గాని, వేలము వాయిదా వేయుటకు గాని, రద్దు చేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 4) వేలం నందు పాల్గొనదలచినవారు 28-03-2025 వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రూ. 10,000/- ధరావత్తు మొత్తం చెల్లించిన తరువాత ఐ.డి. ప్రూఫ్ ఇచ్చి నెంబరు రిజిష్టరు చేసుకొనవలెను. ధరావత్తు చెల్లించి రిజిష్టరు చేసుకొన్న వ్యక్తిని మాత్రమే వేలము వేయు హాలులోకి అనుమతించబడును. 5) హెచ్చు పాటదారుడు మొత్తం పాట సొమ్మును అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెయును లేని యెడల ధరావత్తు కోల్పోవుదురు 6) నగల బరువుకు నాణ్యతకు బ్యాంకు వారి పూచీ ఏమీ లేదు. 7) వేలం ద్వారా వచ్చిన సొమ్ము బాకీ మొత్తమునకు సరిపోని యెడల చట్టరీత్యా చర్యలు తీసుకొని మిగిలిన బాకీ మొత్తము రాబట్టుకొనబడును. 8) ఇందలి ఖాతాదారులకు ఎవరికైనా ఇతర అప్పులు ఉన్నచో మిగిలిన సొమ్ము ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. 9) వ్యాట్ మరియు ఇతర టాక్సులు పాటదారుడే భరించవలెను. 10) వేలమునకు సంబంధం లేకుండా బంగారు ఆభరణాలను బహిరంగ మార్కెట్‌లో అమ్మడానికి బ్యాంకు వారికి హక్కులు కలవు.

తేది : 16-03-2025
స్థలం : అనంతపురము

సం/- రీజనల్ మేనేజర్
రీజనల్ ఆఫీసు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, అనంతపురము

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు టెన్త్ విద్యార్థి పరార్

- రైల్వే స్టేషన్‌లో గుర్తించిన పోలీసులు

పెనుకొండ: పరీక్షల వేళ సెల్‌ఫోన్ చూడవద్దని తండ్రి మందలించాడని పదో తరగతి విద్యార్థి ఇంటినుంచి పరారయ్యాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నారాయణమ్మ కాలనీ సమీపాన నివాసముంటున్నా లికిరెడ్డి వాయునందన్‌రెడ్డి పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం నుంచి పరీక్షలు మొదలవుతాయి. అయితే శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్ చూస్తుండడంతో తండ్రి నాగార్జునరెడ్డి గమనించి గట్టిగా మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన వాయునందన్‌రెడ్డి ఇంటినుంచి పరారయ్యాడు. కుమారుడు ఎంత సేపైనా ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెదికిన తండ్రి, ఇతర కుటుంబసభ్యులు అదేరోజు రాత్రి 11 గంటల తర్వాత ఎస్‌ఐ వెంకటేశ్వర్లును కలసి ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ వెంటనే పోలీసు సిబ్బందితో బస్టాండ్, రైల్వేస్టేషన్, జాతీయ రహదారి, పలు హోటళ్ల వద్ద గాలింపు చేపట్టారు. చివరకు రైల్వేస్టేషన్‌లో దాక్కుని ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకుని, విద్యార్థిని మందలించి చక్కగా చదువుకోవాలని, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించారు.

దోపిడీ కేసులో ఇద్దరు అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ

తాడిపత్రి: చుక్కలూరు పారిశ్రామికవాడలో రెండు రోజుల క్రితం మహిళను బెదిరించి రూ.10 వేలు దోచుకెళ్లిన ఘటనలో రూరల్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశార. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శివవగంగాధర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. పారిశ్రామిక వాడలోని ఓ నల్లబండల పరిశ్రమను వెంకటేశ్వరమ్మ, కళాచారి దంపతులు బాడుగకు తీసుకుని నడుపుతున్నారు. ఈ నెల 14న తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామానికి చెందిన నాగేంద్ర అలియాస్ కొక్కీ, సుబ్బరాయుడులు ద్విచక్ర వాహనంపై నల్లబండల పరిశ్రమ వద్దకు వెళ్లారు. అక్కడ కళాచారిని ఒకరు మాటల్లో పెట్టి.. మరొకరు ఇంట్లోకి చొరబడి వెంకటేశ్వరమ్మను గొంతు పిసికి, చంపుతామని, బెదిరించి, ఆమె వద్ద ఉన్న రూ.10 వేల నగదు లాక్కుని బైక్‌పై ఉడాయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు నాగేంద్ర అలియాస్ కొక్కీ, సుబ్బరాయుడును చుక్కలూరు క్రాస్ వద్ద అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు రూరల్ సీఐ తెలిపారు. నిందితులను 24 గంటల్లోనే అరెస్ట్ చేసిన రూరల్ ఎస్‌ఐ ధరణీబాబు, ఏఎస్‌ఐ కాటమయ్య, కానిస్టేబుళ్లు అంకన్న, సుధాకర్‌లను సీఐ అభినందించారు.

చెట్టుపైనుంచి పడి కూలీ మృతి


కెంచయ్య (ఫైల్)

కుందుర్పి: శ్రీమజ్జనపల్లికి చెందిన వ్యవసాయ కూలీ కెంచయ్య (42) శనివారం చింతచెట్టుపైనుంచి ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... కెంచయ్య రోజువారీ కూలి పనుల్లో భాగంగా శనివారం ఉదయం చింతకాయలు కోయడానికి సమీపంలోని పుట్రాళ్లపల్లి వద్దకు వెళ్లాడు. అక్కడ చింతకాయలు కోసే క్రమంలో కాలుజారి చెట్టుపైనుంచి కింద పడ్డాడు. తలకు, మర్మావయవాలకు తీవ్రగాయాలవడంతో వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కెంచయ్యకు భార్య నేత్ర, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం


ప్రజలతో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుంతకల్లుటౌన్: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్' కార్యక్రమంపై శనివారం గుంతకల్లు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణానికి ప్రమాదమని తెలిసినా ప్లాస్టిక్ వినియోగం మాత్రం తగ్గడం లేదన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరిలో మార్పు రావాలని, మన ప్రవర్తనలో కూడా స్వచ్ఛత ఉండాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పాలని కోరారు. స్వచ్ఛభారత్ నిర్మాణానికి, ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కాగా ప్లాస్టిక్ భూతాల వేషధారణలతో పారిశుధ్య కార్మికులు అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, ఆర్‌డీఓ శ్రీనివాస్, కమిషనర్ నయీమ్ అహ్మద్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకే గుండాల తండా ఆదర్శం కావాలి..

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండలంలోని గుండాల తండా గ్రామం జిల్లాలోని అన్ని గ్రామాలకు ఆదర్శం కావాలని, ఆ విధంగా గ్రామాన్ని తీర్చిదిద్దే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. గుండాల తండాలో నిర్వహించిన 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో వివిధ రకాల కార్యక్రమాలను ప్రారంభించారు. మన శరీరాన్ని శుభ్రంగా ఉంచుకున్నట్లుగా గ్రామాన్ని కూడా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి




మాట్లాడుతున్న డాక్టర్ హేమచంద్రారెడ్డి

గుంతకల్లుటౌన్: 'విలువలతో కూడిన విద్యకు మార్కులతో కొలమానం లేదు. విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగుతూ విలువలతో కూడిన విద్యనభ్యసించాలి' అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ హేమచంద్రారెడ్డి అన్నారు. స్థానిక శ్రీవివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో పాఠశాల 24 వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, నైపుణ్యాలను పాఠశాల నుంచే అలవర్చుకున్నప్పుడే విద్యార్థులు గొప్పగా తయారవుతారని చెప్పారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పోటీ ప్రపంచంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, విద్యాసంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మంజునాథ్, కరస్పాండెంట్ ఓంకారప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎంటెక్, ఎం ఫార్మసీ ఫలితాలు విడుదల


అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఎంటెక్, ఎం ఫార్మసీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఎంటెక్ నాలుగో సెమిస్టర్ (ఆర్-21) సప్లిమెంటరీ, ఎం ఫార్మసీ నాలుగో సెమిస్టర్ (ఆర్-21), రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ, ఒకటో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, బీ ఫార్మసీ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-25), రెగ్యులర్ ఒకటో సెమిస్టర్ (ఆర్-19, ఆర్-15) సప్లిమెంటరీ, రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-19, ఆర్-15) సప్లిమెంటరీ, ఫార్మా డి నాలుగు, మూడో, రెండో సంవత్సరం (ఆర్-17) అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు తెలిపారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

అరటికి గిట్టుబాటు ధర కల్పించండి


డీడీ హెచ్ నరసింహారావుకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: అరటికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని పండ్లతోటల రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం సంఘం నాయకులు కుళ్లాయప్ప, సంజీవరెడ్డి, శ్రీనివాసులు తదితరులతో కలిసి ఉద్యాన శాఖ కార్యాలయంలో డీడీ బీఎంవీ నరసింహారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా నార్పల, పుట్లూరు, యల్లనూరు, బెళుగుప్ప, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి, బుక్కరాయసముద్రం తదితర మండలాల్లో 13 వేల మంది వరకు రైతులు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో అరటి సాగు చేస్తున్నారన్నారు. గ్రాండ్-9 రకం అరటి ఏటా 6.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందన్నారు. అరబ్ దేశాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ఎగుమతి అవుతోందన్నారు. అయితే నెల కిందట వరకు టన్ను రూ.26 వేల వరకు పలికిన అరటి ధర ఇపుడు రూ.13 వేలు, రూ.14 వేలకు ధర పడిపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీలకు సరఫరా చేసే దళారులు కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర దక్కకుండా చేస్తున్నట్లు తెలిపారు. టన్ను రూ.26 వేలకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రామలింగచౌదరికి అవార్డు


డాక్టర్ జి.రామలింగచౌదరి

అనంతపురం: ఎస్కేయూలోని గ్రామీణాభివృద్ధి శాఖలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.రామలింగచౌదరికి భారత మానవాభివృద్ధి శాఖ అవార్డు ప్రదానం చేసింది. భారత సామాజిక మండలి శాస్త్ర పరిశోధన సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఎస్కేయూ గ్రామీణాభివృద్ధి విభాగంలో మాజీ రెక్టార్ ప్రొఫెసర్ జి.శ్రీధర్ పర్యవేక్షణలో 'కరువు ప్రాంతం అయిన అనంతపురం జిల్లాలో వ్యవసాయాభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రజల జీవనోపాధి భద్రతను మెరుగుపరచడం'పై పరిశోధనలు చేశారు. అంతేకాకుండా పలు అంతర్జాతీయ సదస్సుల్లో గ్రామీణాభివృద్ధి, సూక్ష్మ నీటి పారుదల సౌకర్యాల ప్రాధాన్యతలను గురించి అనేక పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రామలింగచౌదరిని పలువురు అభినందించారు.

వివాహిత బలవన్మరణం

బుక్కరాయసముద్రం: కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తర కర్ణాటక ప్రాంతానికి చెందిన సితార (26), ప్రవీణ్ మోర్ దంపతులు. వీరు బుక్కరాయసముద్రంలోని నార్పల క్రాసింగ్ వద్ద బేకరీ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. భార్యభర్తలు తరచూ గొడవ పడుతుండేవారు. శుక్రవారం రాత్రి కూడా ఇద్దరూ తగువులాడుకున్నారు. మనస్తాపానికి గురైన సితార ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ ఆయా దుర్మరణం

కళ్యాణదుర్గం రూరల్: బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా లక్ష్మి (40) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మి, వన్నూరస్వామి దంపతులు శనివారం సాయంత్రం వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై కళ్యాణదుర్గం బయలుదేరారు. గూబనపల్లి సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త వన్నూస్వామి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వేటకొడవళ్లతో రెండు వర్గాల దాడులు

- నలుగురికి గాయాలు

యల్లనూరు: వేటకొడవళ్లతో రెండు వర్గాల దాడులు చేసుకున్నాయి. ఇందులో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని గడ్డంవారిపల్లికి చెందిన విరూపాక్ష గారి రఘురామాంజుల రెడ్డి, సిద్దవటం నారాయణరెడ్డికి మధ్య భూ సమస్యలు ఉన్నాయి. ఇటీవల నారాయణరెడ్డి తన భూమిని సర్వే చేసి రాళ్లు పాతుకోగా.. రఘురామాంజులరెడ్డి వాటిని తొలగించాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రెండు కుటుంబాలు గొడవకు దిగాయి. పరస్పరం వేటకొడవళ్లతో దాడులు చేసుకున్నారు. ఘటనలో నారాయణరెడ్డి, ఆయన భార్య వెంకటలక్ష్మమ్మకు, రఘురామాంజులరెడ్డికి, కుమారుడు మహేంద్రరెడ్డికి గాయాలయ్యాయి. నారాయణరెడ్డి, భార్య వెంకటలక్ష్మమ్మను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొడుకు లేని జీవితం వద్దని..

- రైలుకిందపడి తల్లి ఆత్మహత్య


శైలజ (ఫైల్)

తాడిపత్రి: ప్రేమ వివాహానికి తాను అంగీకరించకపోవడం వల్లే తనయుడు ప్రాణం తీసుకున్నాడని మనోవేదనకు గురైన తల్లి తను కూడా ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన తాడిపత్రిలో చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపిన వివరాలిల ఉన్నాయి. పట్టణంలోని శ్రీనివాసపురానికి చెందిన కొండజోగుల శైలజ (40), సురేంద్రబాబు దంపతులకు శ్రీచరణ్ ఏకైక సంతానం. కుమారుడు అనంతపురంలో డిప్లొమా పూర్తి చేశాడు. శ్రీచరణ్ బంధువుల అమ్మాయిని ప్రేమించాడు. విషయం తెలుసుకున్న అమ్మాయి తరపు కుటుంబ సభ్యులు, బంధువులు కొద్ది రోజుల క్రితం వీరిద్దరి వివాహం చేసేందుకు ఒప్పుకోవాలని శైలజను కోరారు. ఇందుకు ఆమె నిరాకరించడంతో శ్రీచరణ్ అనంతపురం శివారులోని ప్రసన్నాయపల్లిలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం తాడిపత్రిలో అంత్యక్రియలు ముగిశాయి. కుమారుడి చావుకు కారణమయ్యావంటూ బంధువులు, కుటుంబ సభ్యులు విమర్శలు చేయడంతో మానసికంగా కుంగిపోయిన శైలజ శనివారం ఉదయం రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడింది. సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ నాగప్ప తెలిపారు.

మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో ఏప్రిల్ 3 నుంచి నెల రోజులపాటు నిరుద్యోగ మహిళలకు జర్దోసి మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వారై ఉండి, ఆధార్, రేషన్ కార్డు కలిగిన మహిళలు దరఖాస్తుకు అర్హులుగా పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం కల్పిస్తామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 94925 83484 నంబరులో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు ఆర్థోటిక్ పరికరాలు



పరికరాలు అందజేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌లో బెంగళూరు రిహాబ్ ఫెడరేషన్ వారి సహకారంతో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు శనివారం 20 మంది చిన్నారులకు ఆర్థోటిక్ పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టుకతో ఇబ్బందులు పడుతున్న చిన్నారులకు రూ.2.10 లక్షల విలువ చేసే పరికరాలను రిహాబ్ ఫెడరేషన్ వారు ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. డీఈఐసీలో వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్థో హెచ్ఓడీ డాక్టర్ ఆత్మారాం, ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సైన్స్ కేంద్రంలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. 'వికసిత భారత్ కోసం సైన్స్, నూతన ఆవిష్కరణలలో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత', 'బాల్య వివాహాలు-పర్యవసానాలు', 'దుర అలవాట్లు-పర్యవసానాలు', 'చిన్న వయసులోనే గర్భధారణ-పర్యవసానాలు' అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి సుమారు 145 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ చేతుల మీదుగా ప్రశంశపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి బాలమురళీ కృష్ణ, ఎన్‌జీసీ రీజనల్ కో-ఆర్డినేటర్ ఆనంద భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం మెడికల్: విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదానికి గురైన ఆశావర్కర్ పద్మావతికి మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగమణి, నాగేంద్రకుమార్ మాట్లాడారు. తరిమెల పీహెచ్‌సీలో ఆశావర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పద్మావతిని అక్కడి సిబ్బంది వ్యాక్సిన్ క్యారియర్ తీసుకుని రావాలని శనివారం సలకం చెరువుకు పంపడం జరిగిందన్నారు. పద్మావతి తన కుమారుడుని వెంటపెట్టుకుని సలకం చెరువు నుంచి తరిమెలకు వస్తుండగా మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురైందన్నారు. తలకు దెబ్బ తగిలినా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇంత వరకు వైద్యులు పట్టించుకోలేదని మండిపడ్డారు. వాస్తవంగా ఏఎన్ఎం చేసే పనులను ఆశావర్కర్‌తో చేయించడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణం దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాల్, రామాంజనేయులు, సౌజన్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలు పిలుస్తున్నాయ్..

- గ్రామీణ విద్యార్థులకు వరం 'మోడల్ పాఠశాలలు'
- 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- ఈనెల 31వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష



రాప్తాడు ఆదర్శ పాఠశాల

రాప్తాడు: కార్పొరేట్ నమూనాలో అన్ని వసతులు, హంగులతో ఏర్పాటైన మోడల్ స్కూళ్లకు (ఆదర్శ పాఠశాలలు) ఆదరణ పెరుగుతోంది. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సత్ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ పాఠశాలలు సీబీఎస్ఈకి అనుబంధంగా ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు ఫిబ్రవరి 21వ తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. మార్చి 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్, కార్డులు, యూపీఐ ద్వారా ఆన్‌లైన్‌లో ఎగ్జామినేషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించేందుకు www.cse.ap.gov. in, or www. apms. apcfss. in వెబ్‌సైట్ చూడొచ్చు. ఆరో తరగతిలో ప్రవేశానికి గతేడాది మాదిరిగానే పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూల్‌లోనే ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మెరిట్‌లిస్ట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లను కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్ లిస్ట్, అదే రోజు సెలక్షన్ లిస్ట్‌ను సైతం వెల్లడిస్తారు. ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయిస్తారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

టెన్త్ ఫలితాల్లో హవా..

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా రాణిస్తున్నారు. దీంతో ఏపీ మోడల్ స్కూళ్లల్లో తమ పిల్లలను చదివించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. ఉమ్మడి అనతపురం జిల్లాలో ఆదర్శ పాఠశాలలు 25 ఉన్నాయి. రాప్తాడు, గార్లదిన్నె, పామిడి, గుత్తి, యాడికి, వజ్రాకరూరు, ఉరవకొండ, విడపనకల్లు, రాయదుర్గం, కణేకల్లు, కళ్యాణదుర్గం, శెట్టూరు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, ధర్మవరం, పుట్టపర్తి, నల్లచెరువు, అమడగూరు, అగళి, అమరాపురం, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, హిందూపురం మండలాల్లో పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో ఆరో తరగతికి గతంలో 80 సీట్లు మాత్రమే కేటాయించే వారు. విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్‌కు అప్పటి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ అధికారులు వంద సీట్లకు పెంచారు. దీంతో ఈ లెక్కన 25 పాఠశాలల్లో 2,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు దక్కనున్నాయి. ఇందుకు పోటీ కూడా ఎక్కువగా ఉండబోతుంది. ఒక్కో సీటుకు ఐదు నుంచి పది మంది విద్యార్థులు పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. జిల్లాలో ప్రస్తుతం ఆదర్శ పాఠశాల లేని మండలాల్లోని విద్యార్థులు సమీప మండలాల ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. సొంత మండల విద్యార్థులు లేని పక్షంలో మాత్రమే పక్క మండలాల విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ఇంటర్ వరకూ ఉచితం



పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. నూతన భవనాలు, విశాలమైన తరగతి గదులు, మెరుగైన సౌకర్యాలు ఉండటంతో ఈ పాఠశాలకు ఆదరణ పెరుగుతోంది. ఈ పాఠశాలల్లో ఒక్కసారి సీటు దక్కితే ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకూ చదువుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవాలనే తపన ఉండే గ్రామీణ విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు వరంగా చెప్పవచ్చు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ప్రతిభ కనబరిస్తే సీటు దక్కుతుంది.

– మల్లికార్జున, ఎంఈఓ, రాప్తాడు

ఎంపిక ఇలా..

- ఓసీ, బీసీ విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రవేశ పరీక్షలో 35 మార్కులు సాధించాల్సి ఉంటుంది.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి, 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రవేశ పరీక్షలో కనీసం 30 మార్కులు సాధించాలి.
- జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో 4, 5 తరగతుల్లో చదివి ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలి.
- పరీక్షల్లో వచ్చే మార్కులు, రిజర్వేషన్ రూల్ ప్రతిపాదికన సీట్లను కేటాయిస్తారు.
- ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ తరహాలో (మల్టిపుల్ చాయిస్) ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ఉంటుంది.

మోడల్ స్కూళ్లలో సౌకర్యాలు

- నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన
- కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా సువిశాల ప్రాంగణంలో భవనాలు
- ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలోనే బోధన
- విశాల తరగతి గదులు, సౌకర్యవంతమైన వాతావరణంలో ఉచిత విద్య
- నీట్, జేఈఈ, ఎంసెట్, ఎన్ఎమ్ఎమ్ఎస్, ఐఎంఓ, ఐఏప్రో లాంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- స్పోకెన్ ఇంగ్లిష్, హ్యాండ్‌రైటింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ
- అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం, ఆధునిక పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు
- ఎల్‌సీడీ ప్రాజెక్టర్ విద్యా బోధన
- ఇంటర్‌లో అందుబాటులో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు
- 9వ తరగతి నుంచి అకాడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సులు



మండుటెండలో బతుకు పోరు

కడుపు నింపే నాలుగు మెతుకుల కోసం శనివారం ఇద్దరు దివ్యాంగులు రోడ్డెక్కారు. భగభగ మండే ఎర్రని ఎండను సైతం లెక్క చేయలేదు. ఓ దివ్యాంగుడు ట్రైసైకిల్‌లో ఉండగా.. మరో దివ్యాంగుడు రోడ్డుపై పొర్లు దండాలు పెడుతూ భిక్షాటన చేసిన దృశ్యాలు స్థానికులను కలచివేశాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ప్రశ్నించే తత్వముంటేనే న్యాయం

అనంతపురం కల్చరల్: కళ్లముందే కల్తీ జరుగుతున్నా, వస్తు సేవల్లో లోపాలున్నా ప్రశ్నించలేకపోవడం వల్లే మోసపోతున్నామని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ మలోల పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వం అలవరుచుకోవాలని సూచించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణదినం సందర్భంగా శనివారం వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నగరంలోని రాజేంద్ర నగరపాలక పాఠశాల ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మలోలతో పాటు లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి సుధాకర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, ఆహార తనిఖీ అధికారి తస్లీం, జిల్లా పౌర సరఫరాల ఇన్‌చార్జ్ అధికారి జగన్, విద్యాశాఖ ఏడీ కృష్ణయ్య, డీసీఐసీ అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, షేక్ కంబదూరు నబిరసూల్ తదితరులు మాట్లాడారు. వినియోగదారులెవరూ తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వస్తు సేవల్లో కచ్చితత్వాన్ని అడిగే హక్కు చట్టాలు కల్పించాయన్నారు. ఏ వస్తువు కొన్నా రశీదు అడిగే పద్ధతిని అందరూ అలవరచుకుంటే ప్రభుత్వానికి ఎంతో ఆదాయమొస్తుందని, కానీ వ్యాపారులు చేసే ప్రలోభాలకు గురవుతూ ప్రశ్నించలేని స్థితికి ప్రజలు చేరుకుంటున్నారన్నారు. యువత వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకుని ఇతరులకు మార్గదర్శనంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు శ్రీనివాసులు, చల్లాకిషోర్, రియాజుద్దీన్, లక్ష్మీ శ్యామ్, రెడ్స్ సంస్థ భానుజ, జేవీవీ గాంగేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బైబిల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

అనంతపురం కల్చరల్: మనిషి ఉన్నతికి తోడ్పాటు అందించే ఆధ్యాత్మిక విషయాలను అందరూ తెలుసుకోవాలని సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ బెన్‌హర్ బాబు సూచించారు. నగరంలోని సీఎస్ఐ హోలీ ట్రినిటి చర్చి ప్రాంగణంలో ది బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బైబిల్ ఎగ్జిబిషన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బైబిల్‌లోని అనే విషయాలను తెలిపే పలు రకాల పుస్తకాలు, బాల సాహిత్యం అందించే సండే స్కూల్ మెటీరియల్ ఆకర్షణీయంగా ఉందని తెలిపారు. సేవా భావంతో ఏర్పాటు చేసిన బైబిల్ ప్రదర్శన ఆదివారం కూడా ఉంటుందని పేర్కొన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రదర్ సుధీర్, రెవరెండ్ జాన్ విక్రమ్, ఎస్ఐయూ పాస్టర్ సంపత్ విజయ్‌కుమార్, గాస్పెల్ హాలు వరప్రసాదరెడ్డి, జడ్ దేవరాజు, పాస్టర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, రెవరెండ్ మనుష్యే, జీవన్‌బాబు, జీఆర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలపై రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న నాయకత్వంలో మైనార్టీల అభివృద్ధికి రూ.వేల కోట్లు వెచ్చించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో మైనార్టీలకు ఎటువంటి నిధులు కేటాయించలేదు. మైనార్టీల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శులు వేమల నదీం, రహంతుల్లా, తబ్రేజ్, సహాయ కార్యదర్శి షేక్ అఫ్జల్‌తో కలసి కాగజ్‌ఘర్ రిజ్వాన్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో పునః ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చౌకబారు రాజకీయాలు చేశారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.311 కోట్లతో అర్బన్ లింక్ రోడ్డు, బ్రిడ్జ్ (టవర్‌క్లాక్ ఓవర్‌బ్రిడ్జ్) ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో విగ్రహాల ఏర్పాటులో జాప్యం జరిగిందన్నారు. విగ్రహాలు మళ్లీ ఏర్పాటు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్‌బ్రిడ్జికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వక్ఫ్‌బోర్డు సభ్యులు షెక్షావలి, నాయకులు ఏవన్ రఫీ, రియాజ్, ఇసాక్, ఇమ్రాన్, హబీబ్, జాకీర్, యాసిన్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



కలెక్టరేట్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం కార్పొరేషన్: ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచి స్వచ్ఛతకు పాటుపడాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో, జీజీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు.

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డీఆర్ఓ మలోల ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టరేట్‌లో పడేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను తొలగించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి అలెగ్జాండర్, కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, పరిష్కార వేదిక ఇన్‌చార్జి వాణిశ్రీ, భూ విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ల్యాండ్ రిఫార్మ్స్ తహసీల్దార్ నారాయణ స్వామి పాల్గొన్నారు.

రాప్తాడు: అందరి సహకారంతో స్వచ్ఛ రాప్తాడుగా తీర్చిదిద్దుదామని డీఎల్‌డీఓ లలిత బాయి అన్నారు. శనివారం మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త దిబ్బలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను వాడమని గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూ ఏఈ వరలక్ష్మి, సర్పంచు మిగతల శీనయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ సూచించారు. శనివారం మండల కేంద్రంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కామాక్షి, పంచాయతీ సెక్రటరీలు మహబూబ్ బాషా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

అనంతపురం కార్పొరేషన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిద్దామని డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పాతూరు గాంధీ బజార్‌లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

అనంతపురం: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకుందామన్న ఎస్పీ పి.జగదీష్ పిలుపు మేరకు పోలీసులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర -స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి పోలీసులు ర్యాలీ చేశారు. ముందుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు స్టేషన్లు, పోలీసు కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం మున్సిపల్, ఎంపీడీఓ, సచివాలయాలు, తదితర ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి పట్టణాలు, మండల కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా డస్ట్ బిన్లలో వేయాలన్నారు.

జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్



పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజుకు పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లా ఇన్‌చార్జి అధికారి, రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు శనివారం జిల్లాకు విచ్చేశారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు కలెక్టర్ వి.వినోద్ కుమార్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలపై ఇరువురు చర్చించారు.

పుస్తకం తరాల మధ్య వారధి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: ఓ మంచి పుస్తకం తరాల మధ్య వారధి లాగా పనిచేస్తుందని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత పేర్కొన్నారు. శనివారం ఎస్కేయూలో డాక్టర్ జి.హరిజన తిరుపాల్ రచించిన ×షెడ్యూల్ కులాల అభివృద్ధి, సామాజిక మార్పు× అనే నూతన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఈ పుస్తకం సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. సమాజంలోని మార్పును విశ్లేషిస్తూ, షెడ్యూల్ కులాల అభివృద్ధికి అనేక అంశాలను పుస్తకంలో ప్రస్తావించారన్నారు. గ్రామీణాభివృద్ధి విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.మునినారాయణప్ప ఆధ్వర్యంలో ఈ పుస్తకాన్ని రచించినట్లు రచయిత పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, పరీక్షల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ, లా విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీరాములు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిరోజ్‌బాబు, డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీరామ్ నాయక్, పుస్తక రచయిత డాక్టర్ జి.హరిజన తిరుపాల్ పాల్గొన్నారు.

ఏమా టీచరు కమామిషు?

- చియ్యేడు టీచరు వ్యవహారంపై కలెక్టర్ ఆరా
- ఆ టీచరు అక్రమాలపై పునఃవిచారణకు సిద్ధం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: వివాదాస్పదంగా మారిన అనంతపురం రూరల్ మండలం చియ్యేడు ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ బూడిద నాగేంద్ర వ్యవహారంపై కలెక్టర్ వినోద్ కుమార్ ఆరా తీశారు. సదరు టీచరు వ్యవహారంపై ఇటీవల కొందరు గ్రామస్తులు డీఈఓను మొదలుకుని కలెక్టర్, పాఠశాల విద్య కమిషనర్, విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఈ నెల 13న 'సాక్షి'లో 'ఆ టీచరును నమ్ముకుంటే భవిత బూడిద' అనే శీర్షికతో ప్రచురితమైన కథనం విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ దీన్ని సీరియస్‌గా పరిగణించారు. డీఈఓ ప్రసాద్‌బాబును పిలిపించి 'ఏమా టీచరు కమామిషు?' అని ఆరా తీశారు. విచారణ పూర్తయిందని చెప్పినా... మరో అధికారితో పునఃవిచారణ చేయించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

విచారణాధికారిని నియమించనున్న ఆర్జేడీ

స్థానికంగా ఉన్న వారిని కాకుండా బయట ప్రాంతాల వారిని విచారణ అధికారిగా నియమించాలని భావించిన విద్యాశాఖ అధికారులు పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆర్జేడీకి ఫైలు పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా ఆకుతోటపల్లికి చెందిన ఓ వ్యక్తిని బినామీగా పెట్టుకుని చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, గ్రామంలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ వర్గ పోరుకు ఆజ్యం పోయడం, శివాయిజామా భూమిని ఆక్రమించి తన మేనమామ పేరుతో పాస్ బుక్ చేయించడం తదితర అంశాలపై గ్రామస్తులు ఇదివరకే అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ విషయాలన్నీ వెలుగులోకి రావడంతో సదరు టీచరు బెంబేలెత్తుతున్నారు. ఇటీవలే ఓ ధాబాను కూడా బినామీ పేరుతో ప్రారంభించినట్లు గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటన్నింటిపై పునఃవిచారణ జరగనుండడంతో ఉత్కంఠ నెలకొంది.

పుస్తకావిష్కరణ

అనంతపురం: దివ్యాంగుల హక్కుల చట్టం-2016 (తెలుగు అనువాదం) పుస్తకాన్ని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా శనివారం ఆవిష్కరించారు. దివ్యాంగుల హక్కుల గురించి ఈ పుస్తకంలో విపులంగా వివరించారని డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పీఎండీ షఫీ, లీగల్ అడ్వైజర్ జెన్నె ఆనంద్, ఉమ్మడి అనంతపురం జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, కార్యదర్శి రసూల్, ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మన్న, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో మలహోబిల లక్ష్మీ నరసింహుడు

నమో నారసింహ..

పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం పరుష, పన్నారపు బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఉదయం లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. మహా మంగళహారతి అందించారు. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మొక్కుబడి ఉన్న భక్తులు పన్నారపు బండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. పంపనూరు కొండ జనసంద్రంగా మారిపోయింది. భక్తులకు తీర్థప్రసాదాల అందజేసిన అనంతరం అన్నదానం చేశారు. – ఆత్మకూరు:



పరుషలో భక్తుల సందడి



పన్నారపు బండ్లను తిప్పుతున్న భక్తులు

పోరాట యోధుడు కాన్షీరాం

అనంతపురం టవర్‌క్లాక్: దళిత, బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం పోరాడిన యోధుడు కాన్షీరాం అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ తిరుపాల్ అన్నారు. శనివారం కాన్షీరాం జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాండు, భాను ప్రకాష్, ఓబులేసు, నాగభూషణం, వెంకటేష్, ఆనంద్, నరేష్, హరి ఓబులేసు, రాయుడు, మధు, వెంకటేష్ గౌడ్, బాష పాల్గొన్నారు.

8 మందికి మెమోలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలో పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 8 మందికి కమిషనర్ బాలస్వామి మెమోలు జారీ చేశారు. శనివారం నగరంలోని 26, 73, 31, 10 సచివాలయాల పరిధిలో పన్ను వసూళ్లు జరగలేదు. దీంతో ఆర్ఐలు రజాక్, చంద్ర, రఘునాథ్ రెడ్డి, పెద్దక్క, సచివాలయ అడ్మిన్లు శ్రీకాంత్, సోమశేఖర్, ముత్యాలయ్య శివ శంకర్‌కు మెమోలు ఇచ్చారు.